క్లుప్తంగా

మన్యంకొండకు భక్తుల పాదయాత్ర



మరికల్: మండలంలోని పల్లెగడ్డ గ్రామం నుంచి వంద మంది శ్రీవారి భక్తులు మన్యంకొండ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోజరిగే అలివేలు మంగమ్మ కల్యాణోత్సవ వేడుకలకు శుక్రవారం పాదయాత్రగా తరలివెళ్లారు. ప్రతి ఏడాది అలివేలు మంగమ్మ కల్యాణ వేడుకలు తిలకించేందుకు గ్రామం నుంచి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తుందని టీటీడీ సభ్యులు శ్రీరామ్ తెలిపారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలోకి పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం తాగి బాటిళ్లు పగులకొడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెల్ట్ షాపుల జోరు



మరికల్: హోలీ పండుగ సందర్భంగా మద్యం దుకాణాలకు బంద్ చేయాలని ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనికి విరుద్ధంగా శుక్రవారం గ్రామాల్లో బెల్ట్ షాపులు తెరవడంతో కన్మనూర్ గ్రామంలో అలర్లకు దారి తీసింది. మద్యం సేవించి రంగులు చల్లుకోనే క్రమంలో యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఇష్టానుసారంగా పల్లెలో బెల్ట్ దుకాణాలు నడిపిస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారుల చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



కొత్తపల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి మండలం బూనీడు జామియా మస్జిద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు కోట్ల మహేందర్ రెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇమామ్ అబ్దుల్ రజాక్, మౌజమ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు ఇసామొద్దీన్, కతాల్ సాబ్, నబిచాంద్, షఫి, కాంగ్రెస్ నాయకులు సవారి శ్రీను, శ్రీనివాస్ యాదవ్, నరహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా



కోస్గి: అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై వ్యవహరించిన తీరును నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ నేతలు ధర్నా చేపట్టారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు స్థానిక శివాజీ చౌరస్తాలో ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

తిరుపతికి పాదయాత్రగా శ్రీవారి భక్తులు

నర్వ: కొడంగల్ నియోజకవర్గం లక్ష్మీపల్లి, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్ గ్రామాల శ్రీవారి భక్తులు 25 మంది పాదయాత్రగా తిరుపతికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పెద్దకడ్మూర్‌లోని ఆంజనేయ స్వామి బస చేశారు. గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. హిందూ ధర్మపరిరక్షణ, సనాతన ధర్మాన్ని కాపాడాలని వేంకటేశ్వర స్వామి దీవించాలని యాత్ర చేపడుతున్నట్లు వారు. తెలిపారు.


అమ్మపల్లిలో హోలీ వేడుకల్లో ఉపాధి కూలీలు


కోస్గిలో హోలీ వేడుకల్లో మహిళలు


కోటకొండలో హోలీ సంబరాలు..


ధన్వాడలో రంగులు పూసుకొంటున్న యువకులు

హోలీ.. ఆనంద కేళి

- వేడుకల్లో పాల్గొన్న నాయకులు, అధికారులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించి హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణాలు, గ్రామాల్లో యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రోడ్లపై ఉత్సాహంగా ఉల్లాసంగా కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబరాలను జరుపుకొన్నారు. బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా నృత్యాలు చేశారు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా రంగోళి ఆడారు. పలు చోట్ల కాముడి దహనం కార్యక్రమం నిర్వహించారు. హోలీ సందర్భంగా పలువురు నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

■ మక్తల్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో యువత నృత్యాలు చేసుకుంటు హోలీ ఆడారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అంబేడ్కర్ చౌరస్తాలో హోలీ ఆడారు. ఆజాద్‌నగర్‌లో ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సంబరాల్లో పాల్గొన్నారు. లింగంపల్లిలో ఉపాధి కూలీలు సంబరాలు జరుపుకొన్నారు.

■ కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన యువత, ఉపాధి కూలీలు వాలు కట్టల పని చేస్తూ రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

■ మరికల్ మండల వ్యాప్తంగా ఘనంగా హోలీ సంబరాలు చేసుకున్నారు. రోడ్లపై బ్యాండ్ మేళాలతో ఊరేగింపు నిర్వహించి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

■ ధన్వాడ మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో పాలఉట్టి సంబరాలు చేసుకున్నారు. హన్మన్‌పల్లి మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు.

■ దామరగిద్ద మండల కేంద్రంలో కామదహనం చేపట్టారు. చిన్నారులు నృత్యాలు చేస్తు సంబరాల్లో పాల్గొన్నారు.

■ నారాయణపేట రూరల్ మండల కేంద్రంలో మోగిలిపూలతో సాంప్రదాయ రంగులు చల్లుకుంటు హోలీ ఆడారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ నారాయణపేటలో బాల్య మిత్రులతో పాఠశాలకు వెళ్లి హోలీ జరుపుకున్నారు.

■ నర్వ మండల కేంద్రంలో కాముని బొమ్మను ఊరేగించి దహనం చేశారు. యువత జూరాల ప్రాజెక్ట్ వద్ద సంబరాలు చేసుకున్నారు. సందర్శనకు బైక్‌లపై వెళ్లారు.

■ మాగనూర్ మండలంలోని అమ్మపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలు హోలీ చేసుకున్నారు. మండల కేంద్రంలో యువత రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.

■ కృష్ణా మండలంలోని గుడెబల్లూర్, హిందుపూర్, కున్సీ, ముడుమాల్ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

■ కోస్గి మండల కేంద్రంలో ఆనందోత్సవాల వేడుకలు జరుపుకున్నారు. గురువారం రాత్రి పట్టణంలోని పలు కాలనీల్లో కాముని దహన కార్యక్రమం నిర్వహించారు.

■ మద్దూరు మండల కేంద్రంలోని వీధుల్లో హోలీ సందడి నెలకొంది. పాతబస్టాండ్ చౌరస్తాలో వివిధ పార్టీ నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం రాత్రి మద్దూరు చౌడేశ్వరీ దేవాలయం, కాచువాగు శివాలయం, మెట్ల గేరి, పాండురంగ దేవాలయం దగ్గర కామదహనం చేశారు.

■ దామరగిద్ద మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో హోలీ సందర్భంగాగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వినూత్నంగా మేకలను బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


మక్తల్‌లో హోలీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


నేరడగం గ్రామంలో వేడుకల్లో చిన్నారులు


వడ్వాట్ గ్రామంలో హోలీ వేడుకల్లో గ్రామస్తులు


నారాయణపేటలో హోలీ ఆడుకున్న ఐటీడీఏ పీఓ రాహుల్


మరికల్‌లో హోలీ ఉత్సవాల్లో మహిళలు, చిన్నారులు


పెద్దకడ్మూర్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


ధన్వాడలో హోలీ వేడుకలో సందర్భంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు


మక్తల్‌లో హోలీ సంబరాల్లో పోలీసులు


దామరగిద్దలో మేకలను అందజేస్తున్న నిర్వాహకులు


మద్దూరులో కామదహనం చేస్తున్న యువకులు

బోధనతోపాటు ఇళ్లకు వెళ్లి సూచన

- ప్రతిరోజు విద్యార్థులకు సలహాలు
- సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు

మక్తల్: విద్యను బోధించడమే కాదు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి సూచనలిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని వారి తల్లిదండ్రులకు కోరుతున్నాడో ఓ ఉపాధ్యాయుడు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణ్ పాఠశాల పనివేళలు ముగించుకొని దండు, చందాపూర్, టేకులపల్లి, గువ్వలపల్లి, మక్తల్ పట్టణాల్లో గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు, వారి తల్లి దండ్రులతో మాట్లాడుతున్నాడు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు గ్రామాల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి సూచనలు ఇస్తున్నాడు. బడి మానిన విద్యార్థులకు చదువుకోవడం వలన సాధించి విజయాలపై అవగాహన కల్పిస్తున్నాడు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి మంచి మార్కులు సాధించేందుకు తగిన సూచనలు చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.


విద్యార్థుల ఇళ్ల వద్ద ఉపాధ్యాయుడు లక్ష్మణ్(ఫైల్)

కష్టజీవుల గొంతుక కారల్‌మార్క్స్

వనపర్తిటౌన్: కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్త, తాడిత, పీడిత వర్గాల గొంతుకగా కారల్‌మార్క్స్ చరిత్రలో నిలిచారని ప్రజావాగ్గేయకారుడు, మహనీయుల స్ఫూర్తి వేదిక కన్వీనర్ రాజారాంప్రకాశ్ అన్నారు. కారల్‌మార్క్స్ 142 వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, బాలేమియా, గంధం గట్టయ్య, వెంకటస్వామి, శివశంకర్, కుషకుమార్, శ్రీనివాసులు, మహేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఎం పరమేశ్వరచారి అధ్యక్షతన కారల్‌మార్క్స్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, పలువురు నాయకులతో కలసి కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, లక్ష్మి, కురుమయ్య, బాలస్వామి, గంధం గట్టయ్య, నందిమల్ల రాములు, బీసన్న, రత్నయ్య, కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సాధించాలనే తపన ఉండాలి


విజయచిహ్నం చూపుతున్న సీనియర్ సూపరింటెండెంట్

జడ్చర్ల టౌన్: జీవితంలో ఏదైనా సాధించాలనే తపన ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని హైదరాబాద్ సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, సామాజిక వేత్త పీవీపీ అంజలికుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక స్పష్టమైన లక్ష్యం పెట్టుకోవాలని, దానిని సాధించేందుకు భిన్నమైన ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఎస్ఆర్‌డీజీ స్కూల్ ప్రిన్సిపాల్ రాధారాణి, మన సేవాసమితి అధ్యక్షుడు వేణుగోపాల్, కేజీబీవీ ఎస్ఓ తభసమ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ గోవిందరాజులు ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్ 23 వరకు కొనసాగించాలని తెలంగాణ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ఇతర మేనేజ్‌మేంట్ పరిధిలోని పాఠశాలలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని.. అనంతరం మధ్యాహ్న భోజనం అందించాలని వివరించారు. అయితే 10వ తరగతి వార్షిక పరీక్షలు కొనసాగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 వరకు తరగతులు నిర్వహించాలని డీఈఓ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నారాయణపేట ఎడ్యుకేషన్: హైదరాబాద్ కొల్లూరులోని గాడియం స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 23న జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 18న ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి రమణ తెలిపారు. 14, 16, 18, 20 ఏళ్లలోపు బాల బాలికల విభాగం, మహిళ, పురుషుల 100 మీ, 400 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో పోటీలు నిర్వహిస్తామని.. ఆసక్తిగల వారు పదోతరగతి మెమో, తహసీల్దార్ జారీచేసిన కుల, జనన ధ్రువీకరణ పత్రాలతో అథ్లెట్ కోచ్‌లకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

ఖురాన్ పఠనం చేయాలి

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదని, ఇదే మాసంలో దివ్యఖురాన్ అవతరించిందని మౌలాన అబ్దుల్‌అలీం అన్నారు. శుక్రవారం పట్టణంలోని మస్‌జిదే నూర్, మస్జీదే ఆజంజాహి, మస్జీదే సయ్యదియ, మదర్సా మస్జీద్, ఈద్గా మస్జీద్‌లో రంజాన్ మాసం విశిష్టతను వివరించారు. సంపదలో 25 శాతం జకాత్ రూపంలో దాన, ధర్మాలు చేయాలని, నిరుపేదలకు అండగా నిలిచి ఆహార పదార్థాలతో పాటు దుస్తులను సమకూర్చాలని సూచించారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

అమరచింత: మున్సిపాలిటీలోని 4వ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు అజయ్, బుచ్చన్న, శ్యాం సుందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం వారు పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం ఎదుట పూర్తి స్థాయిలో కాంపౌండ్‌ను నిర్మించి అధికారికంగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వార్డులో సామూహిక మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సామూహిక మరుగుదొడ్డి నిర్మించాలన్నారు. బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తున్నామని చెప్పి కేవలం ఆశావర్కర్లకే పరిమితం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సీసీ రహదారులతో పాటు డ్రెయినేజీలను యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు వార్డుల పర్యటన చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా ఉన్నాయని, అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్, నిశాంత్, కుమార్, వెంకటమ్మ పాల్గొన్నారు.


చెత్తతో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాన్ని చూపుతున్న సీపీఎం నాయకులు

అట్టహాసంగా ర్యాకమకొండ బ్రహ్మోత్సవాలు

హన్వాడ: మండలంలోని ర్యాకమకొండపై వెలసిన తిరుమలనాథుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కోయిల్‌కొండ, మహమ్మదాబాద్, గండేడ్, కోస్గి, నారాయణ పేట, మహబూబ్‌నగర్ మండలాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ర్యాకమకొండ బ్రహ్మోత్సవాలకు మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, ఉన్నారు.


ర్యాకమకొండలో కల్యాణమహోత్సవంలో సతీసమేతంగా స్వామివారు


కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు